నమస్తే తెలంగాణ
# రంగారెడ్డి
I హైదరాబాద్, మంగళవారం 22 అక్టోబర్ 2024 RANGAREDDY



పరీక్షా కేంద్రాన్ని పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

# సజావుగా గ్రూప్-1 పరీక్ష

**8,011 మందికి 5,854 మంది అభ్యర్థులు హాజరు**

**2,157 మంది అభ్యర్థులు గైర్హాజరు**

**ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులను అనుమతించని అధికారులు**


**కేంద్రాల వద్ద పోలీస్ శాఖ పటిష్ట బందోబస్తు**

**పరీక్ష నిర్వహణను పర్యవేక్షించిన రంగారెడ్డి కలెక్టర్ శశాంక**

రంగారెడ్డి, అక్టోబర్ 21 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు సోమవారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. తొలిరోజు జనరల్ ఇంగ్లిష్ పేపర్‌ను నిర్వహించారు. జిల్లాలో మొత్తం 11 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 8,011 మంది అభ్యర్థులకుగాను 5,854 మంది పరీక్ష రాయగా.. 2,157 మంది గైర్హాజరయ్యారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన ఓ అభ్యర్థి ఇబ్రహీంపట్నంలోని గురునానక్ కళాశాలలో పరీక్ష రాసేందుకు రెండు నిమిషాలు ఆలస్యంగా రావడంతో అధికారులు లోపలికి అనుమతించలేదు. మొయినాబాద్‌లోని కేజీ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలోని పరీక్షా కేంద్రానికి ఓ అభ్యర్థి ఆలస్యంగా రావడంతో అనుమతించలేదు. దీంతో వారు నిరాశతో వెనుదిరిగి వెళ్లాల్సి వచ్చింది. పరీక్షలను వాయిదా వేయాలంటూ ఆందోళనలు జరుగుతున్న నేపథ్యంలో కేంద్రాల వద్ద పోలీసులు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశారు. అన్ని కేంద్రాల వద్ద బీఎన్‌ఎస్‌ఎస్ 163 సెక్షన్ విధించారు. ప్రతి కేంద్రం పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పటిష్ట నిఘాను ఉంచారు. క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతి కల్పించారు. ఈనెల 27 వరకు వివిధ సబ్జెక్టుల ప్రకారం పరీక్షలు జరుగనున్నాయి.



ఒక్క నిమిషం ఆలస్యంగా రావడంతో గురునానక్ కళాశాల పరీక్షా కేంద్రంలోకి అనుమతించకపోవడంతో రోదిస్తున్న అభ్యర్థిని అఖిల..



పరీక్షా కేంద్రానికి ఆలస్యంగా వచ్చిన అభ్యర్థి వినీత్‌ను అనుమతించని పోలీసులు

### పర్యవేక్షించిన కలెక్టర్ శశాంక..

సోమవారం జిల్లాలో ఏర్పాటు చేసిన గ్రూప్-1మెయిన్స్ పరీక్షల కేంద్రాలను రంగారెడ్డి కలెక్టర్ శశాంక సందర్శించారు. గండిపేట మండలంలోని మహాత్మా గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, మొయినాబాద్ మండలం అజీజ్ నగర్‌లోని విద్యాజ్యోతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, భాస్కర్ నగర్‌లోని జోగిన్‌పల్లి బీఆర్ ఇంజినీరింగ్ కళాశాల సెంటర్లను కలెక్టర్ శశాంక పరిశీలించి మాట్లాడారు. ఈనెల 27వ తేదీ వరకు నిర్వహించే గ్రూప్-1మెయిన్స్ పరీక్షలకు సంబంధించి నిర్వహణలో ఎలాంటి పొరపాట్లు జరుగకుండా ముందస్తు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. అభ్యర్థులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా సెంటర్లలో సదుపాయాలను కల్పించినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల పరిధిలో జిరాక్స్ సెంటర్లను మూసివేయడం జరిగిందన్నారు. రీజనల్ కోఆర్డినేటర్స్, చీఫ్ సూపరింటెండెంట్స్, ఫ్లయింగ్ స్క్వాడ్స్, సిట్టింగ్ స్క్వాడ్స్, ఐడెంటిఫికేషన్ అధికారులు, లైజన్ అధికారులు పరీక్ష నిర్వహణలో తమకు కేటాయించిన విధులను పూర్తి బాధ్యతతో నిర్వహించాలని కలెక్టర్ ఈ సందర్భంగా అధికారులకు సూచించారు. అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ ఇబ్రహీంపట్నం పరిధిలోని శ్రీ ఇందు ఇంజినీరింగ్ కళాశాలను సందర్శించి పరీక్ష నిర్వహణ తీరును పర్యవేక్షించారు.



విద్యాజ్యోతి ఇంజినీరింగ్ పరీక్షా కేంద్రం వద్ద అభ్యర్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

*పచ్చని పంట పొలాలతో కళకళలాడుతున్న పల్లె.. ఫార్మా కంపెనీ ఏర్పాటుతో కళావిహీనంగా మారనున్నది. వ్యవసాయమే జీవనాధారంగా లగచర్ల గ్రామస్తులు బతుకును వెళ్లదీస్తున్నారు. వరి, జొన్న, కంది, పత్తి, సజ్జ, ఉద్యానవన పంటలను సాగు చేస్తున్నారు. ఏటా రెండు పంటలు పండిస్తూ హాయిగా కాలం వెళ్లదీస్తున్న అన్నదాతలకు ఫార్మా భూతం వస్తుందనగానే గుబులు మొదలైంది. కాలుష్య కారక ఫార్మా కంపెనీలు వస్తాయన్న ప్రభుత్వ ప్రకటనతో నిద్రాహారాలు మాని మళ్లీ దుబాయ్, ముంబయ్ వలసలు పోయి బతుకాల్సి వస్తదేమోనని ఆందోళన చెందుతున్నారు. బీఆర్‌ఎస్ హయాంలో రంచన్‌గా పెట్టుబడి సాయం అందేదని, రైతుబీమా, పంట రుణమాఫీ పథకాలు అందడం వల్ల ఎవుసం పండుగలా సాగింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి మా భూములు లాక్కుంటే ఎట్లా బతుకాలని లగచర్ల గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బతుకులు బాగు చేస్తడని రేవంత్ రెడ్డిని గెలిపిస్తే సొంత నియోజకవర్గంలోనే కాలుష్య కారక ఫార్మా కంపెనీలను తీసుకొస్తుండంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఫార్మా విలేజ్ ఏర్పాటుకు మా భూములివ్వంటూ తెగేసి చెబుతున్నారు.*

*- వికారాబాద్, అక్టోబర్ 21 (నమస్తే తెలంగాణ)*







# ఫార్మా వస్తే..

**ఫార్మా కంపెనీల ఏర్పాటుపై ఆది నుంచి దుద్యాల మండలం లగచర్ల గ్రామ రైతుల అభ్యంతరం**

# మళ్లీ వలసలే..

- మా భూములు లాక్కుంటే దుబాయ్, ముంబయ్ వలసలు వెళ్లాల్సి వస్తదని ఆవేదన
- కంపెనీల వల్ల ఈ ప్రాంతమంతా కాలుష్య కారకమే..
- గుక్కెడు తాగునీళ్లకు కరువొస్తది.. పంటలను సాగూ చేయలేం
- ఫార్మా విలేజ్ ఏర్పాటుపై లగచర్ల గ్రామ రైతుల ఆందోళన

### ఊరంతా వ్యవసాయమే జీవనాధారం..

లగచర్ల గ్రామ జనాభా దాదాపు 2 వేలకు పైగా ఉంటుంది. గ్రామస్తులంతా వ్యవసాయమే జీవనాధారంగా బతుకుతున్నారు. బోర్ల కింద, వర్షాధార పంటలను సాగు చేస్తూ ఉపాధి పొందుతున్నారు. గ్రామంలో 1900 ఎకరాలకుపైగా సాగు భూమి ఉన్నది. వరి, జొన్న, పత్తి, కంది, సజ్జలు, జొన్నలు, ఉద్యానవన పంటలు మామిడి, బత్తాయి తదితర పంటలు పండిస్తున్నారు. బంగారు పంటలు పండే భూములను లాక్కుంటే ఏ ఊరికెళ్లి ఏం పని చేయాలి... ఎలా బతుకాలో సీఎం రేవంత్‌రెడ్డి చెప్పాలని రైతులు నిలదీస్తున్నారు. ఫార్మా విలేజ్‌కు భూములిచ్చే ప్రసక్తే లేదని, మమ్మల్ని చంపి భూములను తీసుకోవాలని తెగేసి చెబుతున్నారు. ఫార్మా కంపెనీల ఏర్పాటు నిర్ణయాన్ని విరమించుకోవాలని అన్నదాతలు డిమాండ్ చేస్తున్నారు.

### ఆది నుంచి ఫార్మా ఏర్పాటుపై వ్యతిరేకతే..

కొడంగల్ నియోజకవర్గంలోని దుద్యాల మండలంలో ఫార్మా విలేజ్ ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించి ప్రకటన చేసినకాడి నుంచి రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. దుద్యాల మండలంలోని హకీంపేట, పోలేపల్లి, లగచర్ల గ్రామాల్లో ఫార్మా విలేజ్ కోసం 1274.25 ఎకరాల భూమిని ప్రభుత్వం సేకరించనున్నది. సరిపడా ప్రభుత్వ భూమి లేనికారణంగా పట్టా భూములనూ ప్రభుత్వం తీసుకోనున్నది. హకీంపేటలో 505.37 ఎకరాలు, పోలేపల్లిలో 130 ఎకరాలు, లగచర్లలో 643 ఎకరాలను ఫార్మా కోసం సేకరించనున్నది. ఇప్పటికే లగచెర్ల గ్రామ పరిధిలో 632.26 ఎకరాలు, పోలేపల్లిలో 71.39 ఎకరాల పట్టా భూములను సేకరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది.

### నిన్ను సీఎంను చేస్తే.. మాకు కష్టాలు తెస్తవా..



రేవంత్‌రెడ్డి... ఓట్లు వేసి నిన్ను సీఎంను చేస్తే.. మా భూములు లాక్కొని కష్టాలపాలుజేస్తావా..? కష్టపడి సంపాదించుకున్న భూమిని ఎలా వదులుకుంటాం. ఫార్మా కంపెనీలు వద్దే వద్దు. ఈ కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రానేరావద్దు. ఇంతమంది రైతులను బాధ పెట్టి ఏం సాధిస్తవ్ రేవంత్‌రెడ్డి... మా కష్టాలు, బాధలు పట్టించుకోకుండా మా నోటికాడి కూడును లాక్కుంటవా.. ఇందుకేనా నిన్ను గెలిపించింది. ఫార్మా కోసం మా భూములు ఇచ్చే ప్రసక్తే లేదు. ఎంతటి పోరాటానికైనా సిద్ధం.

– సంగు వెంకటయ్య, లగచర్ల, దుద్యాల మండలం

### రెక్కల కష్టాన్ని దోచుకోవద్దు..



దుబాయ్‌కి వెళ్లి తిని, తినక రెక్కలు ముక్కలు చేసుకుని డబ్బు సంపాదించి కొంత పొలం కొనుక్కున్నా. ఫార్మా విలేజ్ పేరుతో నా రెక్కల కష్టాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం లాక్కొంటున్నది. వయస్సు మీదపడింది.. మళ్లీ దుబాయ్‌కి వెళ్లలేను. తిరిగి పొలాన్ని కొనలేను. మా భూములు తీసుకోవాలనే నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలి. నాకు ఇద్దకు కొడుకులు. కష్టపడ్డ సంపదను కాంగ్రెస్ సర్కార్ గద్దలా తన్నుకెళ్తే నా పిల్లలకు ఏమివ్వాలి. ఫార్మాకు మా భూమి ఇచ్చే ప్రసక్తే లేదు.

– వెంకటయ్య, లగచర్ల, దుద్యాల మండలం

### నీళ్లు తెస్తడనుకుంటే.. కన్నీళ్లు తెప్పిస్తుండు..



రేవంత్‌రెడ్డి సీఎం అయితే నియోజకవర్గానికి పుష్కలంగా సాగు నీరు వస్తదనుకుంటే కన్నీళ్లు తెప్పిస్తుండు. ఫార్మా కంపెనీలు వస్తాయన్న కాడినుంచి మింగలేక, కక్కలేక.. మా బాధను ఎవరికీ చెప్పుకోలేక రోజు ఏడుస్తూ బతుకుతున్నం. ఫార్మా కంపెనీల వల్ల ఊరినే ఖాళీ చేయాల్సి వస్తుంది. పచ్చని పంట పొలాలు కనుమరుగవుతాయి. తాగేందుకు గుక్కెడు నీళ్లు దొరకని పరిస్థితి వస్తది. మా భూములను కాపాడుకునేందుకు ఎంత దూరమైనా వెళ్తం.. ఎంతవరకైనా కొట్లాడుతం.

– మొగులప్ప, లగచర్ల, దుద్యాల మండలం

### కాంగ్రెస్ సర్కార్ గోస పెడుతున్నది...



కాంగ్రెస్ ప్రభుత్వం ఫార్మా కంపెనీల కోసం పొలాలను లాక్కోవాలని చూస్తూ రైతులను గోస పెడుతున్నది. రైతు పచ్చగా ఉంటేనే రాష్ట్రం, దేశం పచ్చగా ఉంటుంది. అన్నదాతలు కన్నెర్రజేస్తే ఎలా ఉంటుందో రాబోవు రోజుల్లో సీఎం రేవంత్‌రెడ్డికి తెలుస్తది. వ్యవసాయం వదిలి ఎక్కడికి వలస వెళ్లి బతుకాలి. ఎన్ని రోజులకైనా సొంత ఊరికి చేరుకోవాల్సిందే. ఫార్మాతో ఊరే ఖాళీ అయ్యే పరిస్థితి దాపురిస్తున్నది. పచ్చటి పంట భూముల్లో ఫార్మా కంపెనీలు పెట్టడం బాధాకరం.

– వికాస్, లగచర్ల, దుద్యాల మండలం

### ఫార్మాతో పరేషాన్..



ఎవుసం చేసే బతుకుతం. మాకు వేరే పని తెల్వదు. పొద్దున లేచి పొలంలో పని చేసుకునే మాకు.. కాంగ్రెస్ ప్రభుత్వం ఫార్మా కంపెనీ అంటూ పరేషాన్‌ల పడేసింది. నా భూమిని పిల్లలకు ఇచ్చి ప్రశాంతంగా గడుపుదామనుకున్న సమయంలో ఈ దగాకోరు కాంగ్రెస్ ప్రభుత్వం భూమిని లాక్కోవాలని చూస్తున్నది. భూమి పోతుందంటే తిండి కూడా తినాలనిపించడం లేదు. ఎవుసం చేసే పిల్లల పెండ్లిళ్లు చేసినా. మా పిల్లలు కూడా ఎవుసంపైనే ఆధారపడి జీవిస్తున్నరు. ఉన్న భూమి లాక్కుంటే ఏలా బతకాలో ప్రభుత్వమే చెప్పాలి.

– రాములు, లగచర్ల, దుద్యాల మండలం

### దేశానికి మా అన్న రక్షణ.. మా పొలానికి రక్షణేది ?



మా అన్న ఆర్మీలో ఉండి దేశ రక్షణకు శ్రమిస్తున్నాడు. కల్లబొల్లిమాటలు నమ్మి కాంగ్రెస్‌ను గెలిపిస్తే మా భూములు లాగేసుకుంటున్నరు. మా భూములకు రక్షణేది దేవుడా అని నిత్యం దిగులు చెందుతున్నా. ఫార్మాతో భూమి పోయి రోడ్డున పడే పరిస్థితి వచ్చింది. ఫార్మా కంపెనీలను ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతమంతా నాశనమవుతుంది. ఎవ్వరు వచ్చినా, ఏం చెప్పినా మా భూములు ఇవ్వమంటే ఇవ్వం.

– కావలి శ్రీనివాస్, లగచర్ల, దుద్యాల మండలం

### పొలం పోతే కూలీలుగానే బతకాలి..



ఊహ తెలిసిన నాటి నుంచి వ్యవసాయమే తప్ప మరో పని తెల్వదు. అటువంటిది ఇప్పుడు భూమిని లాక్కుంటే ఏం చేసుకొని బతకాలి. పొలాల్లో యజమానులుగా ఉన్నోళ్లం, కూలీలుగా మారాల్సిందేనా...? రైతుల శాపం కాంగ్రెస్‌కు తగులుతది. రేవంత్‌రెడ్డిని సీఎం చేస్తే మా బతుకులు మారుతాయనుకున్నాం. కానీ రోడ్డున పడుతామని అనుకోలేదు. ఫార్మా నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి. లేదంటే మా భూముల కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధం.

– గుండమోని బసప్ప ముదిరాజ్, లగచర్ల, దుద్యాల మండలం

### పొలం పోతే బతికేదెలా..?



మాది ఉమ్మడి కుటుంబం. భూమిని నమ్ముకొని ట్రాక్టర్ తెచ్చుకొని వ్యవసాయం చేసుకొంటున్నాం. మా మొత్తం భూమి ఫార్మాలో పోతుంది. అందరూ చిన్న పిల్లలు. పొలం పోతే బతికేదెలా..? ఫార్మా కంపెనీలు అంటున్న నాటి నుంచి రోజూ ఏడుస్తూ జీవిస్తున్నం. ఈ ప్రాంతం చాలా స్వచ్ఛమైన వాతావరణం ఉంటుంది. ఫార్మా వస్తే.. కాలుష్యమై రోగాల బారినపడుతం. భూమి తీసుకుంటే ఏ ఊరికెళ్లాలి.. ఏం చేసి బతుకాలో సీఎం చెప్పాలి.

– రాఘవేందర్, లగచర్ల, దుద్యాల మండలం

# పోలీస్ అమరులకు ఘన నివాళి

వికారాబాద్, అక్టోబర్ 21 : పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సోమవారం వికారాబాద్ జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఎస్పీ ఆధ్వర్యంలో పోలీస్ అమరవీరుల స్థూపాన్ని ఏర్పాటు చేశారు. కలెక్టర్ ప్రతీక్ జైన్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ఎస్పీ నారాయణరెడ్డి, అదనపు ఎస్పీలు రవీందర్‌రెడ్డి, మురళీధర్‌లు పోలీస్ అమరవీరుల స్థూపానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. పోలీస్ గౌరవ వందనం చేస్తూ అమర వీరులను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతీక్‌జైన్ మాట్లాడుతూ పోలీస్ అమరవీరులను స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న పోలీస్ సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామన్నారు. పోలీస్ డిపార్ట్‌మెంట్ అధికారులు పండుగల పూట కూడా విధి నిర్వహణలో పాల్గొంటారని గుర్తు చేశారు. పోలీస్ వ్యవస్థ ప్రజల ప్రశాంతత కోసం, తమ ప్రశాంతతను కోల్పోయి కూడా సేవలందిస్తున్నందుకు గర్వించాలన్నారు. దేశంలో శాంతి భద్రతలు అదుపులో ఉన్నప్పుడే ప్రజలు సుఖఃసంతోషాలతో ఉంటారన్నారు. పోలీస్ అమరుల త్యాగాన్ని స్మరిస్తూ నివాళులర్పించడంతో పాటు వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఎస్పీ నారాయణరెడ్డి మాట్లాడుతూ 1959 అక్టోబర్ 21న ఇండియా – చైనాకు మధ్య సియాచిన్ అనే ప్రాంతాన్ని అక్రమంగా ఆక్రమించుకుంటున్నారనే దశలో జరిగిన పోరాటంలో పంజాబ్ పోలీసులు వీరోచితంగా పోరాడి 21 మంది ప్రాణాలను కోల్పోయారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఏటా పోలీస్‌ల అమరుల దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామన్నారు. జిల్లాలో పది రోజుల పాటుగా పోలీస్ స్టేషన్లలో వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా ప్రజలు, విద్యార్థులు కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. దేశంలో ప్రజల సంరక్షణ కోసం 1.9.2023 నుంచి 31.8.2024 మధ్య కాలంలో 214 మంది పోలీసులు ప్రాణాలను కోల్పోయారన్నారు. ఎంతో మంది పోలీస్ అధికారులు నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రాణ త్యాగాలు చేశారన్నారు. అనంతరం ఏడాది కాలంలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ అమరుల పేర్లను గుర్తుచేసుకొన్నారు. పోలీసు అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులు అర్పించి, రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వాసు చంద్ర, డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, సీఐలు భీమ్‌కుమార్, నవీన్‌కుమార్, ఎస్‌ఐలు సురేశ్, స్రవంతి, సంతోశ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



పోలీస్ అమరవీరుల స్థూపానికి నివాళులర్పించి.. మౌనం పాటిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి, పోలీసులు

# వుడా ఏర్పాటు..

**వికారాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు**

**నాలుగు మున్సిపాలిటీలు, 493 గ్రామాలతో కలిపి వుడా ఏర్పాటు**

**చైర్మన్‌గా కలెక్టర్**

**జిల్లా సమగ్రాభివృద్ధే ధ్యేయంగా ఏర్పాటు**

వికారాబాద్, అక్టోబర్ 21 (నమస్తే తెలంగాణ) : జిల్లా సమగ్రాభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం వుడాను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ మేరకు వికారాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(వుడా) ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలతోపాటు 493 గ్రామాలను కలుపుతూ రాష్ట్ర ప్రభుత్వం వుడాను ఏర్పాటు చేసింది. జిల్లాలోని వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ మున్సిపాలిటీలతోపాటు కొడంగల్ మండల పరిధిలో 17 గ్రామాలు, వికారాబాద్ మండలంలో 24 గ్రామాలు, తాండూరు మండలంలో 39 గ్రామాలు, పరిగి మండలంలో 35 గ్రామాలు, బొంరాస్‌పేట మండలంలో 16 గ్రామాలు, దుద్యాల మండలంలో 12 గ్రామాలు, కులకచర్ల మండలంలో 15 గ్రామాలు, బషీరాబాద్ మండలంలో 30 గ్రామాలు, మోమిన్‌పేట మండలంలో 22 గ్రామాలు, నవాబుపేట మండలంలో 21 గ్రామాలు, ధారూరు మండలంలో 32 గ్రామాలు, దౌల్తాబాద్ మండలంలో 24 గ్రామాలు, యాలాల మండలంలో 32 గ్రామాలు, బంట్వారం మండలంలో 13 గ్రామాలు, కోట్‌పల్లి మండలంలో 17 గ్రామాలు, పూడూరు మండలంలో 33 గ్రామాలు, మర్పల్లి మండలంలో 27 గ్రామాలు, దోమ మండలంలో 27 గ్రామాలు, పెద్దేముల్ మండలంలో 28 గ్రామాలు, చౌడాపూర్ మండలంలో 13 గ్రామాలను వుడా పరిధిలోకి తీసుకొస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వుడా చైర్మన్‌గా వికారాబాద్ కలెక్టర్, వైస్ చైర్మన్‌గా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, సభ్యులుగా ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి లేదా కార్యదర్శి లేదా వారు నామినేట్ చేసిన వారితోపాటు సీడీఎంఏ, డీటీసీపీ లను సభ్యులుగా ప్రభుత్వం నియమించింది. వుడా అధికారులు మున్సిపాలిటీలతోపాటు వుడా పరిధిలోకి తీసుకొచ్చిన గ్రామాల అభివృద్ధికి మాస్టర్ ప్లాన్‌ను రూపొందించనున్నారు. మున్సిపాలిటీలతోపాటు వుడా పరిధిలోకి తీసుకొచ్చిన గ్రామాల్లో రోడ్లు, తాగునీరు తదితర మౌలిక సదుపాయాలను కల్పించనున్నారు. రవాణా సదుపాయాన్ని మెరుగుపర్చేందుకుగాను ఔటర్ రింగ్ రోడ్లను నిర్మించనున్నారు.